

● 'బుజ్జిబ్బా.. ఈ మధ్య పని ఎక్కువైంది. మా పిల్లలు తిన్న తర్వాత కంచం తీయరు. బడి నుంచి వచ్చి పుస్తకాల సంచి ఓ చోట, దుస్తులు మరోచోట పారేస్తారు. వాటిని సర్దాలంటే తల ప్రాణం తోక కొస్తోంది.' అంటూ ఓ తల్లి పని మొత్తం చేస్తోంది.

● 'మా పాప డిగ్రీ చదువుతోంది.. ఇల్లు ఊడ్వదు. కంచంలోంచి కింద పడిన మెతుకులు తీయదు. మా వాడికేమో దుప్పటి మడతపెట్టడం రాదు. గదుల్లో లైట్లు ఆఫ్ చేయాలన్నా మా పనే..' మరో మాతృమూర్తి ఇంటి పనంతా చక్కబెడుతోంది.

ఇంత వరకు బాగానే ఉన్నా.. వారిని మార్చాల్సింది.. కొంతలో కొంతైనా పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు.. తల్లే కదా!

ఆదివారం అమ్మకు తోడుగా..

న్యూస్‌టుడే-కొత్తకోట



సెలవుల్లో చదువులను పక్కన బెట్టి అమ్మకు సాయం చేద్దాం అనే భావన పిల్లల్లో కల్పించాలి. వారిలో తప్పని సరిగా మార్పు వస్తుంది. వారు కోరుకున్న వంట వారే చేసే యేలా చూడండి. ఆ అనుభూతే వేరు. సమయం దొరకడం తప్పు కాదు.. కాని, ఆ ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారితే జీవన నైపుణ్యాలు లేక పిల్లల ఉన్నతికి ప్రతి బంధక మవుతుంది. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణుల హెచ్చరిక. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే గృహ నిర్వహణలో ఆర్థిక, భౌతిక, సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతా యని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో ప్రస్తావించింది. వీటిని 'ఆదివారం' నుంచి ఆచరించ డంలో పిల్లలను ప్రోత్సహిద్దాం.



బాధ్యత పెరుగుతుంది : సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యత పెరుగు తుంది. వారిలో ధైర్యం, పట్టుదల, క్రమ శిక్షణవంటి లక్షణాలు అలవడు తాయి. వారిపై నమ్మకం ఏర్పడుతుంది. సేవాలక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొం టారు. ఇంట్లో పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి గడిపే నాణ్యమైన సమయం పెరుగు తుంది. సంబంధ బాంధవ్యాలు మెరు గవుతాయి. మంచి చెడు పంచుకోవ డంతో ఈ తరాన్ని వేధిస్తున్న ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటివి దరి చేరవు.

పిల్లలతో ఇంటి పనులు చేయిద్దాం

(పని, విద్య పుస్తకంలో నిర్దేశించిన కృత్యాలు)
● ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపరుచుకోవడం ● చెప్పులు, బూట్లను శుభ్రం చేసి క్రమపద్ధతిలో పెట్టుకోవడం ● విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సహా మేరకు ఉతకడం ● వినియోగ వస్తువులు, దుస్తులు, పుస్తకాలు, క్రమపద్ధతిలో అమర్చు కోవడం ● ఇంటి సరకులు భద్రపరచడంలో సాయం చేయడం ● నీళ్ల పట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడంలో సహక రించడం ● మొక్కలకు నీళ్లు పట్టడం, వంట వులు వేయడం ● భోజనానికి తాగునీరు ఏర్పాటు చేయడం, కంచాలు తీసి కడగడం ● మరుగుదొడ్ల వినియోగించాక నీరు పోసి పరిశుభ్రంగా ఉంచడం





తల్లిదండ్రులదే బాధ్యత : పిల్లల్ని మీద నిజంగా ప్రేమున్నట్ల యితే వారితో తరచూ ఇంటి పనులు చేయించండి. వారికి బాధ్యతలను గుర్తు చేయండి. ఏ పని చేస్తున్నా బాగుంది.. ఇంకా వేగంగా.. మెరుగ్గా.. చేయగలవంటూ ప్రోత్సహించండి. వారి భాగస్వామ్యం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని అర్థమయ్యేలా చెప్పండి. పిల్లల్ని ప్రేమించడంతో పాటు వారికి అన్ని నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.
- శ్రీనివాసరాజు, మానసిక వైద్యనిపుణులు, మహబూబ్‌నగర్

పీయూ ఉపకులపతి బాధ్యతల స్వీకరణ

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా డా.జీఎన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ప్రణాళిక సంఘం ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్న నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ ఏడాది మే 21 నుంచి ఉపకులపతి పోస్టు ఖాళీగానే ఉంది. లక్ష్మీకాంత్ రాథోడ్ తరువాత రెగ్యులర్ ఉపకులపతి రాకపోవడంతో నదీం అహ్మద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్య తలు తీసుకున్నారు. వచ్చే సోమవారం శ్రీనివాస్ పాలమూరు విశ్వవిద్యాలయా నికి రానున్నారు. ఇక్కడ బాధ్యతలను చేపట్టనున్నారు.



ఇన్‌ఛార్జి వీసీ నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

చిన్నారుల ఆరోగ్యం మీ చేతుల్లోనే!

● 55 శాతం విద్యార్థుల స్నాక్స్ డబ్బాల్లో జంక్ ఫుడ్
● తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు

ఈనాడు, మహబూబ్‌నగర్ -న్యూస్‌టుడే, వనపర్తి టౌన్




వనపర్తిలోని ఓ పాఠశాలలో అల్పాహారం తింటున్న ఎల్‌కేజీ చిన్నారులు

చిన్నారులు వాతావరణంలో చిన్న చిన్న మార్పులకే తట్టుకోలేరు.. వాంతులు, విరేచనాలు, జ్వరం బారినపడి ఇబ్బందుల పాలవుతారు. ఒక్కసారి ఆస్పత్రికి వెళ్తే వారం వరకు కోలుకోరు. అలాంటి వాళ్లకు ప్రమాదకరమైన జంక్ ఫుడ్ రోజూ పెడితే వారి లేత పేగుల పరిస్థితి ఎలా తయారవుతుంది..? వారి ఆరోగ్యం ఎంత ప్రమాదంలో పడ తుంది..? వారి భవిష్యత్తు ఏమవుతుందని ఆలోచిస్తేనే భయమేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది తల్లిదండ్రులు అలాంటి ఆహారాన్నే పెడుతున్నారని 'ఈనాడు' పరిశీలనలో తేలింది. ఇలా చేయటం పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.




వనపర్తిలోని ఓ ప్రైవేటు పాఠశాల చిన్నారుల అల్పాహారం



55 శాతం మందికి జంక్ ఫుడే : నేడు మూడు, నాలుగేళ్ల ప్రాయం నుంచే చిన్నారులను బడికి పంపి స్తున్నాం. ఉదయం 9 గంటల కల్లా వారు పాఠ శాలల్లో ఉంటున్నారు. మధ్యాహ్నం తినే భోజనం కూడా ఉదయమే వండి పంపిస్తున్నారు. మధ్యలో తినడానికి చిరుతిళ్లు (స్నాక్స్) డబ్బాలో పెడుతు న్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా కేంద్రాల్లోని పాఠశాలల్లో 1,000 మంది చిన్నారుల చిరుతిళ్ల డబ్బాలు 'ఈనాడు' పరిశీలించగా 55 శాతం చిప్స్, చాక్లెట్లు, మైదా పదార్థాలతో కూడిన ప్రమాదకర ప్యాకెజ్డ్ జంక్ ఫుడ్, బిస్కెట్లు కనిపిం చాయి. ఉరుకులు పరు గుల జీవితంలో సమయం లేదని తల్లి దండ్రులు సులభమైన పనిగా ఇలా చేస్తు న్నారు. కొందరు తల్లిదం డ్రులను అడిగితే పిల్లలు అవే తింటారని చెబుతున్నారు. 35.2 శాతం తల్లిదండ్రులు మాత్రం ఇంట్లో వండిన ఆరోగ్యకర ఆహార పదార్థాలు, చిరు తిళ్లు పంపించారు. మరో 9.8 శాతం మంది పిల్ల లకు పండ్లను పంపించారు. మొత్తంగా 45 శాతం చిన్నారులకు మంచి ఆహారమే అందుతోంది.

గుర్తించినవి ఇవే..



అమలు కాని నిషేధం : నిబంధనల ప్రకారం ఐదో తరగతి లోపు చిన్నారులు ఉండే పాఠ శాలలకు సమీపంలో చిప్స్, ఇతర జంక్ ఫుడ్ విక్రయించొద్దు. ఇది ఎక్కడా అమలు కావటం లేదు. పాఠశాలలకు ఆనుకునే ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లి దండ్రులు ఇచ్చే రూ.5, రూ.10లతో జంక్ ఫుడే కొనుక్కుని తింటున్నారు.



నీటి గంట అవసరం : చాలా పాఠశా లల్లో విద్యార్థులు స్నాక్ డబ్బాతో పాటు నీటిసీసాలు తెచ్చు కుంటున్నారు. 80 శాతం చిన్నారులు భోజనం సమయం లో మాత్రమే నీటిని తాగుతున్నారు. సీసాల్లోని నీటిని అలాగే ఇంటికి తీసుకొ స్తున్నారు. పాఠశాలల్లో నీటి గంట(వాటర్ బెల్) అమలు చేయాల్సిన అవసరముంది.



ఈ ప్రయత్నం బాగు : మహబూబ్‌న గర్, గద్వాల, వనపర్తి, జడ్చర్ల, నారాయణ పేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణా ల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమా న్యాలు విద్యార్థులు జంక్ ఫుడ్ తినకుండా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి. ఎవరైనా జంక్‌ఫుడ్ తెచ్చుకుంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రు లకు ఫోన్‌చేసి అవగాహన కల్పిస్తున్నారు.



ఇన్‌ఫెక్షన్లు, ఊబకాయం సమస్యలు : చిన్నారులకు జంక్ ఫుడ్ అలవాటైతే అన్నంపై ఆసక్తి చూపరు. జీర్ణ శక్తి మందగిస్తుంది. మాంసకృత్తులు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు అందక ఎదుగుదల లోపించి ఆరోగ్యం దెబ్బ తింటుంది. జంకుఫుడ్‌లో నూనె, కలుషిత పదార్థాలు అధి కంగా ఉంటాయి. వాటిని తినటం వల్ల పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతాయి. వయస్సు పెరిగే కొద్దీ గ్యాస్, కడుపునొప్పి, ఊబ కాయం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అనారోగ్య సమ స్యలు వస్తాయి. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారినపడి అస్వస్థతకు గురవుతారు.
- డా.బాల శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



పండ్లు, పోషకాహారం అవసరం.. : ప్యాకింగ్ ఆహా రంలో గ్యాస్ ఉంటుంది. కవర్ వాసన వస్తుంది. బిస్కె ట్లలో మైదా ఎక్కువగా ఉంటుంది. వీటిని నమలకుం డానే తినేస్తుటారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలకు చిప్స్, ఇతర ప్యాకింగ్ ఆహారాన్ని స్నాక్స్ డబ్బాల్లో అస్సలు పెట్టొద్దు. ఐదో తరగతిలోపు చిన్నారులకు పండ్ల రసాలు, పండ్లు, క్యారెట్, కీరా, జావ, ఇంట్లో తయారు చేసే సంప్రదాయ అల్పా హారం పెట్టాలి. రక్తహీనత బారినపడకుండా పెద్ద పిల్లలకు పల్లీలు, బెల్లం చిక్కీలు, బాదం, పిస్తా, లడ్డూలు, ఉడకపెట్టిన గుడ్లు, పండ్లు అందించాలి.
- శైలజ, పోషకాహార కౌన్సిలర్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

నీటిపన్ను వసూలుకు సహకరించండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో నీటిపన్ను వసూలుకు ప్రజాప్రతినిధులు సహకరిం చాలని పురపాలిక డీఈ యూనిస్ కోరారు. శనివారం పురపాలికలో బిల్లుల వసూలుపై ఆయన సిబ్బందితో ఆరా తీశారు. రూ.6 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది దృష్టి పెట్టకపోవడంతో బకాయి పేరకుపోయిందన్నారు. ఈ నెల 9నుంచి ఇప్పటి వరకు రూ. 18.20 లక్షలు వసూలు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో కొందరి పేర్ల మీద రెండు నల్లా కనెక్షన్లు నమోదయ్యాయన్నారు. వాటిని తొలగిస్తామన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్, ఎంటీ విభాగం అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పెండిం గ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీ స్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరా లను అడిగి తెలుసుకున్నారు. శాస్త్ర, సాంకేతిక ఆధారాలతో పకడ్బందీగా నేరాల్లో దర్యాప్తు చేసి నప్పుడు అలాంటి దర్యాప్తును న్యాయస్థానాలు నమ్ముతాయని, నిందితులు చట్టం నుంచి తప్పించుకోకుండా శిక్షలు పడతాయని చెప్పారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, గంజాయి, గుట్కా, మట్కా లాంటి నిషేధిత వస్తువుల రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయా లని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో నేరస్థులను పట్టుకొని సొత్తు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలన్నారు. శాంతి భద్రతపరి రక్షణలో భాగంగా ప్రజలకు పోలీ సుశాఖపై నమ్మకం పెరిగేలా బాధ్యతలు నిర్వ ర్తించాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నేరా లను తగ్గుముఖంలో పరోక్షంగా సహకరించిన సీసీఎస్ సీఐ రవిపాల్, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపూర్, డీసీఆర్బీ ఎస్సై మంజునాథ్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ, రవిప్రకాశ్, సిబ్బంది సంజీవయ్య, మురళీకృష్ణ, రాంగోపాల్ శర్మ, స్వామిలకు ప్రశంసాపత్రం, రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ రాందాస్ తేజ, డీఎస్పీ వెంకటేశ్వరావు, సైబర్‌క్రైమ్ డీఎస్పీ రత్నం, వనపర్తి, కొత్తకోట సీఐలు నాగ భూషణంరావు, శివకుమార్ పాల్గొన్నారు.

చోదకులు రహదారి నిబంధనలు పాటించాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వాహన చోదకులు రహదారి నిబంధనలను పాటించా లని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. శని వారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల వాహనాల తనిఖీ, చోదకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంటీ విభాగం అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు వాహనాల నిర్వహణ సరిగా చూసుకున్న పోలీసు వాహన చోదకులు శివకు మార్‌గౌడ్, రామాంజనేయులు, శ్రవణ్‌కుమా ర్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్ర మంలో ఏఎస్పీ రాందాస్‌తేజ, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి, డీసీఆర్బీ డీఎస్పీలు వెంకటేశ్వరరావు, కృష్ణకిశోర్, వనపర్తి సీఐ నాగభూషణంరావు, ఆర్ఐ అప్పలనాయుడు, ఎంటీ విభాగం సిబ్బంది, చోదకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలతో ప్రయోజనం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై, ఎస్సీ, ఎస్టీ కార్పొరే షన్ రుణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగిన వారందరూ బీమా పథకాలకు అర్హులేనన్నారు. 2018-19లో ఉపాధి కోసం ఎస్సీ శాఖ ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాలు అమలు కాకపోవడానికి కారణాలేమిటని ఈడీ మల్లికార్జున్‌ను ప్రశ్నించారు. గిరిజనుల అభ్యున్నతికి 80శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా రుణాలు కేటాయిస్తోందన్నారు. జిల్లాలో ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరి జన శాఖ అధికారిణి నుషి తను ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయి మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, స్థిర ఆదాయం వచ్చే నూతన యూనిట్లను స్థాపించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా చూడాలన్నారు. పారిశ్రామిక రంగంలో రాణిం చేందుకు యువతకు ఆసక్తి ఉంటే పీఎంఈజీపీ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా యూనిట్లను నెలకొల్పేందుకు సిద్ధంగా ఉంటే జిల్లా పరిశ్రమల శాఖాధికారి నగేశ్, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్‌కిషోర్‌పాండేను సంప్ర దించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

భూ కొలతల్లో జాప్యం..అన్నదాత ఆగం



మండలం	పెండింగ్‌లో దరఖాస్తులు
గోపాల్‌పేట	79
శ్రీరంగాపురం	14
వీపనగండ్ల	36
రేవల్లి	42
పాన్‌గల్	40
వనపర్తి	28
పెబ్బేరు	79
అమరచింత	54
ఖిల్లాగణపురం	117
పెబ్బేర్	45
కొత్తకోట	124
మదనపురం	50
ఆత్మకూరు	27
చిన్నంబావి	23

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : భూముల సర్వేకు అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. చలాన్లు కట్టి నెలలు కావస్తున్నా సర్వే యర్లు పట్టించుకోవడం లేదు. భూ కొలతల్లో వచ్చే తేడాలు, తగ దాలు, ఇతర అంశాల పరిష్కా రంలో సర్వే తప్పనిసరి కావ డంతో కర్షకులు వివాదాలు పరి ష్కరించుకోవడానికి సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో భూసర్వే దరఖాస్తులు (చలాన్లు) వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. చేయి తడపనిదే పనులు కావడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు.

869 దరఖాస్తులు పెండింగ్ : జిల్లాలో 14 మండలాల్లో 255 గ్రామపంచాయతీలు, ఐదు పురపా లికలున్నాయి. ప్రతి మండలానికి సర్వేయర్లు ఉన్నారు. రెండేళ్ల నుంచి 1,885 మంది రైతులు భూముల సర్వేకు దరఖాస్తులు చేశారు. ఇందులో 869 దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నిబంధనల ప్రకారం వరుసక్ర మంలో అధికారులు సర్వే చేయాలి. కొందరివి ఎప్పుడూ పెండింగ్‌లో ఉంటుండగా మరికొం దరివి వెంటనే చేస్తున్నారు. భూ కొలతలు చేసేందుకు అధికారులు సకాలంలో రాకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తు న్నారు. దీనికి ప్రభుత్వ ధ్రువీకరణ ఉండదు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



మాకు 1.28 ఎకరాల భూమి ఉంది. అన్నదమ్ములం పంచుకున్నాం. రెండేళ్ల కిందట సర్వే కోసం దరఖాస్తు చేసు కున్నాం. పొలం హద్దులు గుర్తించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరు గుతున్నా పట్టించుకోవడం లేదు. **- రామన్‌గౌడ్, రాజపేట, వనపర్తి**

రెండేళ్లుగా తిరుగుతున్నా



నా మనుమడి శివయ్య పేరున 31 గుంటల భూమి పట్టా చేశా. భూమి హద్దులు గుర్తించాలని రెండేళ్ల కింద సర్వే కోసం రూ. 250 చెల్లించాను. సర్వే కోసం అప్పటి నుంచి తిరుగుతున్నా. రేపుమాపంటూ తిప్పుతున్నారే తప్ప అధికారులు స్పందించడం లేదు.
- నాగన్న, నాచనహళ్లి, వనపర్తి

పరిష్కరిస్తున్నాం..

జిల్లాలో ఆత్మకూరు, అమరచింత, రేవల్లి మండలాలకు ఇన్‌ఛార్జి సర్వే యర్లు ఉన్నారు. ప్రభుత్వభూమి, కాలువలకు సంబంధించిన భూములు, కొత్తగా గ్రామపంచాయతీ భవన నిర్మా ణాల కోసం స్థలాల గుర్తింపులో నిమ గ్నమై ఉన్నాం. అందువల్ల దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి నెల సర్వేయర్లతో సమీక్ష నిర్వహి స్తున్నాం. రోజూ గ్రామాలకు వెళ్లి సర్వే చేస్తున్నాం. రెండు, మూడు నెలలో పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తాం.
- బాలకృష్ణ, ఏడీ, భూమి కొలతల శాఖ, వనపర్తి

21 నుంచి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) కార్యక్రమాలను ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే విద్యార్థులకు, కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐ, పోలీసు అధికారులకు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి 24 వరకు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఉంటుం దన్నారు. పోలీసు అధికారుల నుంచి సిబ్బందికి, విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటో, వీడియో గ్రాఫ ర్లకు లఘు చిత్రాలు, ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయ న్నారు. ఫొటోలు, వీడియోలు ఈ నెల 22వ తేదీ లోగా ఎస్పీ పీఆర్వోకు అందించాలని సూచించారు.



వేరుశనగ చేనులో తుంపర పరికరాలు

అరకొర కేటాయింపులతో అవస్థలు

ఉద్యాన రైతులకు దక్కని తుంపర పరికరాలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం : ఉద్యాన శాఖలో తుంపర పరికరాల పంపిణీ పెద్ద సమస్యగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై తుంపర పరికరాలను అందించాలని నిర్ణయించినా ఒక్కో మండలానికి ఐదు యూనిట్లను కూడా కేటాయించలేదు. యాసంగి పంటగా వేరుశనగ సాగు చేసిన రైతుల నుంచి మాత్రం భారీగా డిమాండ్ ఉంది. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా 6,500 మంది రైతులు తుంపర పరికరాలు కావాలని దరఖాస్తు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క జోగులాంబ గద్వాల జిల్లాలోనే డిమాండ్ తక్కువగా ఉంది. జిల్లాకు 80 యూనిట్లను మాత్రమే కేయించగా ఎస్సీ, ఎస్టీ రైతులను ఎంపిక చేశారు. మరో 500 మంది వరకు రైతులు పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లా	దరఖాస్తులు	యూనిట్లు
నాగర్‌కర్నూల్	6,500	516
మహబూబ్‌నగర్	2,900	100
నారాయణపేటలో	3,200	100
వనపర్తిలో	5,000	162
గద్వాల	580	80

ప్రచారం లేకపోయినా భారీ దరఖాస్తులు : ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట 2.60 లక్షల ఎకరాల్లో సాగైంది. నాగ ర్‌కర్నూల్ జిలాలో 1.20 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా సాగవుతుంది. అందుకే ఇక్కడ తుంపర పరికరాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. గడచిన ఐదేళ్లుగా తుంపర పరికరా లపై గత ప్రభుత్వం రాయితీ ఇవ్వలేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.23,385గా ధర నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం 75 శాతం అంటే రూ.17,539 రాయితీగా భరిస్తుంది. మిగతా 25 శాతంగా రూ.7,483లను రైతు డీడీ తీసి ఉద్యాన శాఖకు సమర్పిస్తే 25 హెచ్‌డీ పైపులు, ఐదు తుంపర పరికరాల నాజిల్స్ అందిస్తారు. ఉమ్మడి జిల్లాకు 958 యూనిట్లను మాత్రమే కేటాయించగా 18,100 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు ప్రచారం చేసి ఉంటే ఇంకా రెండు మూడింతల దరఖాస్తులు వస్తాయంటే అతిశయోక్తి కాదు.

అధికారులకు తలనొప్పిగా..

ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వం కేటా యించిన అరకొర యూనిట్లను వేల మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి పంచాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చి కార్యాలయాల్లోని అధికారులకు అందిస్తున్నారు. కొందరు ఫోన్లు చేయిస్తున్నారు. జిల్లాల అధికా రులు ఎవరినీ ఎంపిక చేయకుండా మరిన్ని యూనిట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. నాగర్‌కర్నూల్, మహబూ బ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు జగన్, అక్బర్, వేణు గోపాల్, సురేష్‌లు 'న్యూస్‌టుడే'తో మాట్లా డుతూ ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని రాష్ట్ర ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యేలు కూడా చెప్పారని పేర్కొన్నారు.

శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల



శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరుగుతుం డటంతో శ్రీశైలం జలా శయం నాలుగు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగా ర్జునసాగర్‌కు వదులుతు న్నారు. ఎగువన ఉన్న జూరాల, హంద్రీ, సుంకేశుల జలాశయాల నుంచి నీటి ప్రవాహం కొనసాగు తోంది. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు సుంకేశుల జలాశయం నుంచి 72,114 క్యూసె క్కులు హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు స్పిల్ వే ద్వారా 1,79,971 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులు తున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయంలో నీటి మట్టం 884.70 అడుగు లకు, నీటి నిల్వ 213.8824 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కృష్ణాతీరం.. పర్యాటక సోయగం!



సోమశిలకు పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటోంది. నదిని ఆనుకుని ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేలా కొత్త రిసార్టులు వెలుస్తున్నాయి. సోమశిలలో ఓ చోట కనిపించిన దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. శనివారం గద్వాలకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతికి సంగాల పార్కు వద్ద కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ చౌక్, పాతబస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పదో పటాలం డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



దీక్షితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ రచయితగా పాలమూరు జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాల విద్యార్థినీ దీక్షితకు విజయం సాధించింది. ఈ మేరకు ఆ విద్యార్థినికి ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయిలో పాలమూరు విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని గెలిచినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, డీఎస్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్లు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో గద్వాల జిల్లా, తృతీయ స్థానంలో నారాయణపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తృతీయ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గెలుపొందిన క్రీడాకారుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు శారదాబాయి, పాండు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వడెన్న, జేపీఎన్‌సీఈ రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హంగుల్లో తగ్గేదేలే!

హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులోనూ గృహాలంకరణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే పోలీస్ ఉద్యోగి తన అభిరుచి మేరకు అద్భుతంగా ఇంటిని నిర్మించారు. 235 గజాల స్థలంలో రూ.1.60 కోట్లతో ఇంటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ ఇంటిలోని ఓ గదిలో గోడకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన హంస బొమ్మ ఆకట్టుకుంటోంది. కేవలం ఆ బొమ్మ కోసమే రూ.42 వేలు ఖర్చు చేశాడు. ఇంటిలోని అంతర్గత నిర్మాణం కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు తన ఆసక్తి మేరకు 185 గజాల్లో రూ.1.40 కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారు. ప్రతి గదిలో అందంగా ఆకట్టుకునేలా బొమ్మలు, ఇతర గృహోపకరణాలను వినియోగించారు. పడక గదిలో విభిన్నంగా విద్యుత్తు కాంతి వచ్చేలా అద్భుతంగా చిత్రాలు అమర్చారు. గృహాలంకరణకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ : ఓ ఇంట్లోని హోం థియేటర్

న్యూస్‌టుడే, పాలమూరు, కల్వకుర్తి

ఇల్లు కట్టుకోవటం ఓ కళ. అన్ని హంగులతో ఇంటిని ఏర్పాటు చేసుకొని చిరకాల వాంఛ తీర్చుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పట్టణాల్లో రహదారుల సుందరీకరణ, తదితర సౌకర్యాలు సమకూరుతున్నాయి. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి భవనాల నిర్మాణం చేసుకుంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరుతున్నాయి. అయిదు జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 19 పురపాలికల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర రాజధాని నగరం 100 కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో హంగులతో సొంతింటికి మొగ్గు చూపుతున్నారు. అవసరాలు, అభిరుచుల మేరకు అధునాతన వసతులు, భవనాలను అద్భుతమైన రీతిలో నిర్మించు కుంటున్నారు.

● హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గృహాలంకరణ నిపుణులను పిలిచి పనులు అప్పగిస్తున్నారు. గదుల్లో అలంకరణ, పడక, పూజ గదులను దేనికదే ప్రత్యేక సంతరించుకునేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓపెన్ కిచెన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాన్య ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఉన్నతోద్యోగులు, రాజకీయ నాయకుల ఇళ్లలోనూ ఆకర్షణీయ హంగుల కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు.



కల్వకుర్తి : ఓ ఇంట్లో జిగేల్‌మనిపించే గది అలంకరణ



రూ.5 లక్షలతో నిర్మించిన అధునాతన వంట గది



చేతితో తాకే అద్దంలో వెలుగుతున్న విద్యుద్దీపాలు

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల బాలికల జట్లను శనివారం మహబూబ్‌నగర్‌లోని బీఎస్ఏ మైదానంలో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న విలువిద్య పోటీలకు ఈ జట్లను పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, విలువిద్య కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అండగా ఉంటా : కేటీఆర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం వెంకటాపూర్‌కు చెందిన వైద్య విద్యార్థి సుస్మితకు అండగా ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. స్పందించిన కేటీఆర్ 'ఐ విల్ సపోర్ట్ పర్సనల్లీ' అంటూ 'ఎక్స్'లో సందేశం పెట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



'ఎక్స్'లో కేటీఆర్ సందేశం

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



రైలు చక్రాల వద్ద ద్విచక్ర వాహనం

మానవపాడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ దాటిస్తున్న క్రమంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టిందని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఏఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడు. శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వర్షపునీరు నిలవడంతో సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ మీద దాటించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వచ్చేసింది. ద్విచక్ర వాహనాన్ని వదిలేసి రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనం కింద ఉండిపోవడంతో పది నిమిషాలు రైలు ఆగింది. దాన్ని ట్రాక్‌పై నుంచి తొలగించాక రైలు వెళ్లిపోయింది. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

యువకుల గొడవ సీసీ ఫుటేజీ వైరల్

శిరోముండనంలో పోలీసుల పాత్రపై బలపడుతున్న అనుమానాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, లింగాల : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు ముందు జరిగిన గొడవ సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగాక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ముగ్గురికి శిరోముండనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటం, ఇందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. యువకుల మధ్య గొడవతోనే అతడు ఆత్మహత్యాయత్నం చేశాడని, పెట్రోల్ బంక్ వద్ద గొడవ, శిరోముండనం ఘటనలకు, తమకు సంబంధం లేదని పోలీసులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ యువకులు పెట్రోల్ బంకు వద్ద గొడవ పడిన సీసీ కెమెరా ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడిపోయారు. ఈ ఫుటేజీతో శిరోముండనం ఘటనలో పోలీసుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడి తల్లిదండ్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న వీడియోలు బయటకు రావటంతో వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. అక్కడి ఫుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్న చర్చ జరుగుతోంది.

ఇటీవలే ఇసుక వ్యవహారం రచ్చ.. : దుందుభి వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 10 రోజుల కిందట జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులపై మచ్చ పడింది. ఈ వ్యవహారం మరవక ముందే లింగాలలో యువకుల శిరోముండనం ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఘటనలపై విచారణ చేపడతామని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నేతల ఒత్తిడితోనే జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లలేక పోతున్నారని వినిపిస్తోంది.

వాహనం నుంచి జారిపడి బాలకార్మికుడి మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో శనివారం ఉదయం వాహనం నుంచి జారి కింద పడి బాలకార్మికుడు (17) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చుక్కాయిపల్లి నుంచి తాడూరుకు పత్తితీత కోసం కూలీలు సుమారు పన్నెండు మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. పెద్దకొత్తపల్లి దాటాక అదుపు తప్పి వాహనంపైన కూర్చున్న బాలుడు (17) కిందపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకు చెందిన పాటిమిటి చిన్నరాజు, లలిత దంపతులు. ఆమెకు అదే గ్రామానికి చెందిన మధుగాని కురుమూర్తితో వివాహేతర సంబంధం ఉంది. 2019 మే 30న కురుమూర్తి జాతరకు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. అక్కడికి ఆమె ప్రియుడు కూడా వచ్చాడు. భర్తకు మద్యం తాపించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి టవల్‌తో గొంతుకు చుట్టి చంపేశారు. దీంతో మృతుడి అన్న అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసు పరిశోధించి హత్యతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బెయిల్‌పై బయటికి రాగా తరువాత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది, అందులో వాదోపవాదనలు విన్న కుటుంబ న్యాయస్థాన జడ్జి శ్రీదేవి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానాను విధించారు.



సస్యరక్షణ చర్యలకు సన్నద్ధం!

ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు పురుగు మందుల పిచికారీకి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పిచికారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు. యంత్రాల మెకానిక్‌లు కూడా తీరిక లేకుండా కనిపిస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద మరమ్మతుల కోసం రైతులు వరుసగా పెట్టిన పిచికారీ యంత్రాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ రన్నరప్



పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ పోలీసులు సత్తా చాటారు. వీడియోగ్రఫీ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీస్ అకాడమీలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉమ్మడి జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో, నారాయణపేట జిల్లాకు చెందిన ఏఆర్ పీసీ -3341 చంద్రశేఖర్ గౌడ్ వ్యక్తులను తనిఖీ చేయడంలో విశేషమైన ప్రతిభ చాటారు. వారికి వెండి పతకం వచ్చింది. దీంతో జోగులాంబ జోన్ పోలీస్ శాఖకు ఓవరాల్ రన్నరప్‌గా నిలవడంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ట్రోఫీని గెలిచిన వారికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00



సమస్య : పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయానికి వెళ్లే రహదారి గుంతలు పడింది. వర్షం వస్తే నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

- మాసన్న, అమరచింత

సమాధానం : పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చే మట్టి రహదారిని సీసీ రహదారిగా మార్చేందుకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. రూ.2 కోట్ల సీసీ రహదారి పనులకు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించాం.

- వి.మంగమ్మ, పుర ఛైర్‌పర్సన్, అమరచింత

- న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: శ్రీనివాస: **దేవర**
వెంకటేశ్వర: **విశ్వం**, శ్రీరామా: **వేట్టయన్**

ఐటీఐలో కొత్త కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని సాంకేతిక పరిజ్ఞానం కేంద్రం (అడ్వాన్స్‌ టెక్నాలజీ సెంటర్)లో కొత్తగా ప్రారంభించిన ఆరు కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ రమేశ్ బాబు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రవేశాలకు గడువు ఉందని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ అభివృద్ధికి కేంద్రం 10 శాతం, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం తెలంగాణ



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి

విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగ సమస్యలు - సవాళ్లు - కర్తవ్యాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవచారి మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రెడ్డప్ప, సూర్యచంద్ర, హైమావతి, వెంకట్ రాములు, పీసీఐ నాయకులు కొండన్న, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా భాజపా సభ్యత్వ నమోదు

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : భాజపా సభ్యత్వ కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటికే 15 వేల సభ్యత్వ నమోదు దాటిందని జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి వేముల నరేంద్రరావు అన్నారు. శనివారం ఇందిర పార్కు సమీపంలో జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు శిబిరాన్ని జిల్లా భాజపా అధ్యక్షుడు నారాయణతో కలిసి ప్రారంభించారు.

పెబ్బేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరిస్తూ భాజపా సభ్యత్వ నమోదు చేస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పాతపల్లిలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఆత్మకూరు విద్యార్థి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరుకు విద్యార్థి అరవింద్ అండర్-14 విభాగంలో (72 కేజీలు) రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు న్యూ మంక్స్ కుంగ్‌ఫూ శిక్షకుడు నరేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన

పాన్‌గల్, న్యూస్‌టుడే : చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని న్యాయవాదులు ఆంజనేయులు, ఉత్తరయ్య సూచించారు. శనివారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు యాదగిరి, రఘు, ఆంజనేయులు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిపై నిర్లక్ష్యం

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని ఏడో వార్డు అభివృద్ధిపై పుర అధ్యక్షురాలు వి.మంగమ్మ నిర్లక్ష్యం చూపుతున్నారని భాజపా పట్టణ అధ్యక్షుడు కె.భాస్కర్ విమర్శించారు. శనివారం అమరచింతలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడో వార్డు కౌన్సిలర్‌గా భాజపాకు చెందిన ఉషా ఎన్నికయ్యారని, మరో కొన్ని నెలల్లో పాలకవర్గం పదవి కాలం ముగుస్తుందన్నారు. పట్టణంలోని పది వార్డుల్లో ఏడో వార్డులోనే అభివృద్ధి పనులు జరగలేదన్నారు. సమావేశంలో నాయకులు మేర్వ రాజు, సిద్ధూ, రాకేశ్, శ్రీను పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన సర్కారు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయరాములు

అమరచింత, న్యూస్‌టుడే : గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.విజయరాములు విమర్శించారు. శనివారం అమరచింత సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ అసంపూర్తిగా నిలిచిందని, మహిళలకు రూ.2,500 ఆర్థికసాయం, ఆసరా పింఛన్ల పెంపుదల లేదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు రవీందర్, గీతమ్మ, శ్యామ్‌సుందర్, కుతుబ్ పాల్గొన్నారు.





విజేతలకు బహుమతి అందిస్తున్న ప్రతిభ హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్ రమేశ్ నాయక్.. పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వ్యాసరచనతో సృజనకు పదును

వనపర్తి పట్టణం, వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపడుతుందని ప్రతిభ హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్ రమేశ్ నాయక్, శ్రీమేధ హైస్కూల్ ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో రెండు పాఠశాలల్లో 8, 9, పదో తరగతుల విద్యార్థులకు అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మేధాశక్తిని పెంచడానికి 'ఈనాడు' ప్రతి సంవత్సరం ప్రతిభా పోటీలు నిర్వహిస్తోందని చెప్పారు. పాఠకులకు నిత్యం నూతన కథనాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ప్రతిభ పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో లహరి (10వ), ప్రవీణ్ సాయి (10వ), నవ్య శ్రీ (9వ) విజేతలుగా నిలిచారు. శ్రీ మేధ పాఠశాలలో అరిష పాతిమా (10వ), ధాత్రి (9వ), ఆయేషా పాతిమా (8వ) విజేతలుగా నిలిచారు. విజేతలకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, నాగరాజు, మధు, నసీమ్ పాల్గొన్నారు.





విజేతలతో శ్రీమేధ హైస్కూల్ ఉపాధ్యాయులు.. పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

చిన్నంబావి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు మండలంలోని బెక్కెం, మియ్యాపూరం గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో దస్త్రాలు తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకంగా భాగంగా చేపట్టిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛను లబ్ధిదారులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీం సభ్యులు ప్రవీణ్ పాటిల్, మధుసూదన్ దేశ్‌పాండే, అదనపు డీఆర్‌డీవో నాగేంద్రం, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీవో రమణారావు, ఎంపీవో రామస్వామి, అంబుడ్స్‌మెన్ సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెక్కెంలో పింఛను లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎన్ఎల్ఎం బృంద సభ్యులు

డిసెంబరు నాటికి ఆలయ నిర్మాణ పనులు



అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కమిటీ బాధ్యులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరులో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులను డిసెంబరు 14న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపనల నాటికి పూర్తి చేయాలని ఆలయ నిర్మాణ కమిటీ తీర్మానించింది. శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సమావేశంలో దీక్షాపరులు, నిర్మాణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆలయ పనులతో పాటు విద్యుదీకరణ, రంగులు వేసే పనులను విగ్రహ ప్రతిష్ఠాపనకు వారం రోజుల ముందే పూర్తి చేయాలని సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలు వెంటనే చెల్లించాలని ఆలయ స్థలదాత ఎం.శ్రీధర్‌గౌడ్, గర్భగుడి దాత గాడి లక్ష్మీనారాయణ కోరారు. సమావేశంలో స్థపతి బాలసుబ్రహ్మణ్యం, అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి రాష్ట్ర నాయకులు గోపాలకృష్ణమూర్తి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కూరగాయల రఘు, భరత్, జిన్నారం శ్రీనివాసులు, దివాకర్, తోట రవి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణలో కమిటీలే కీలకం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడంలో గ్రామ బాలల పరిరక్షణ, మండల సంరక్షణ కమిటీలు కీలకమని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం బాల్య వివాహాలను అరికట్టే అంశంపై జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థాయి నుంచి అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి ఆర్ఐ స్థాయిలో వేగంగా పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో యాదయ్య, డీడబ్ల్యూవో లక్ష్మమ్మ, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు సుబ్బారెడ్డి, నుషిత, డీపీవో సురేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, డీసీపీవో రాంబాబు, మత్స్యశాఖ జిల్లా అధికారి లక్ష్మప్ప, తహసీల్దార్లు, పుర కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు



యాపర్ల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజు

పెబ్బేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా కృషి చేస్తున్నామని జిల్లా విద్యాధికారి గోవిందరాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని యాపర్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందించడంలో అహర్నిషలు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రజలు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. యాపర్ల గ్రామ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న ఎన్నారై శ్రీహరిరెడ్డి, ఆయన తండ్రి నరేందర్‌రెడ్డిని అభినందించారు. అంతకుముందు సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠకు ఆయన భూమిపూజ చేశారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్, సముదాయ హెచ్ఎం నర్సింహరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్, మెయినుద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు స్వరాజ్యం బాబురెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంత స్థలంపై ఆందోళన వద్దు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో సంత స్థలంపై సర్వహక్కుదారులం మేమే అని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, ఇకపై ఎవరైనా మా అనుమతి లేకుండా ప్రవేశించినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శనివారం కరపత్రాలు కొందరు పంచడంతో వ్యాపారులు, ప్రజలు ఆందోళన చెందారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఓ వైపు సంత విషయంలో ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతుంటే, పుర పాలకవర్గం ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ రామన్‌గౌడ్, దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, షకీల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'రైతులను మోసం చేసిన ప్రభుత్వం'



వనపర్తిలో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : రైతులకు వానాకాలం సీజన్ రైతు భరోసా డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని భారాస నాయకులు విమర్శించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారాస పట్టణ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడారు. ఈ సీజన్‌లో రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ మోసానికి నిదర్శమని మండిపడ్డారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగన్న యాదవ్, నాయకులు విజయ్‌కుమార్, తిరుమల్, జాత్రునాయక్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట, న్యూస్‌టుడే : రైతులకు మార్పు చూపిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారిని మోసం చేయడమే మార్పా అని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వామన్‌గౌడ్ ప్రశ్నించారు. ఈ ఏడాది రైతు భరోసా ఇవ్వడం లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించడాన్ని నిరసిస్తూ శనివారం భారాస కొత్తకోట చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే తప్పుకోవాలని లేదంటే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, శ్రీనివాసులు, బాబురెడ్డి, శ్రీను, మన్యంయాదవ్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం, న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు రైతు భరోసా లేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించడాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం భారాస ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్య, చాంద్‌పాషా, యాదగిరి, విజేందర్‌రెడ్డి, మాసన్న, తిరుపతయ్య, శివశంకర్, కురుమూర్తి, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..



మదనాపురంలో..

వనపర్తి సీఐగా కృష్ణయ్య

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సీఐడీ విభాగంలో సీఐగా పని చేస్తున్న ఎం.కృష్ణయ్య వనపర్తి సీఐగా నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న నాగభూషణంరావు హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షనీయం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమని జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ అన్నారు. శనివారం వనపర్తిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించాలని సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకొవాలని కోరారు. సమావేశంలో గద్వాల సమన్వయకర్త చంద్రశేఖర్, కన్నన్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

లాఠీఛార్జి అమానుషం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాల విధ్వంసం ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంఘాల కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆత్మకూరు పురపాలిక ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, వార్డు సభ్యురాలు మహేశ్వరి, భాజపా నాయకులు తమ్మలి విజయ్, మండ్ల సూరి, లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ లింగన్న, వీహెచ్‌పీ నాయకులు వల్లభ్‌దాస్ విజయకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పోలీసులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

ధర పెంచితేనే చెరకు రైతుకు మనుగడ



సమావేశంలో చెరకు రైతు సంఘం అధ్యక్షుడు రాజన్న, రైతులు

కొత్తకోట, న్యూస్‌టుడే : గిట్టుబాటు ధర పెంచితేనే చెరకు సాగు చేయగలుగుతామని కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా రైతులు పేర్కొన్నారు. శనివారం కొత్తకోటలో ఉమ్మడి జిల్లా రైతుల సమావేశం సంఘం అధ్యక్షుడు రాజన్న అధ్యక్షతన జరిగింది. పదేళ్లుగా ఎరువులు, క్రిమిసంహారకాలు, కూలీల వేతనాలు పెరిగినా వాటికి అనుకూలంగా చెరకు మద్దతు ధర పెంచక పోవడం వల్లే రైతులు ప్రత్యామ్నాయ పంటల్ని చూసుకుంటూ చెరకు సాగుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అధిక శాతం సాగు వచ్చే విత్తనాలు అందజేయాలని, కోతలను రైతులు ఆమోదించిన ధరలకే కూలీలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కర్మాగారం జనరల్ మేనేజర్ రూపేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి శివుడు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సీడీసీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి జాతర రహదారి బాగు చేయండి

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని కొంకలవానిపల్లె గ్రామం నుంచి మద్దూర్ గ్రామం మీదుగా కురుమూర్తి జాతరకు వెళ్లే రహదారిని బాగు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. శనివారం గ్రామ శివారులో కురుమూర్తి-మద్దూర్ రహదారిపై నిల్వ ఉన్న నీటిలో నిరసన చేపట్టి ఆయన మాట్లాడారు. నవంబరు 2 నుంచి కురుమూర్తి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, భక్తుల ప్రయాణం ప్రమాదకరంగా కాకుండా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నిధులు మంజూరు చేయించి రహదారి మరమ్మతు పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీను, మల్లేశ్, లింగన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా హామీలపై కార్యాచరణ చేపట్టడం లేదన్న అంశంపై నిర్వహించిన



మాట్లాడుతున్న జాతీయ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి

సమీక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రూ.2,500, గ్యాస్‌పై రాయితీ రూ.500, పావలా వడ్డీ రుణాలు, స్థానిక సంస్థ ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, పట్టణ అధ్యక్షురాలు జయమ్మ, సభ్యులు శిరీష, భూమిక తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభ గోడపత్రికల విడుదల

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే మాలల ఆత్మగౌరవ సభ కార్యక్రమ గోడపత్రికలను శనివారం మండలంలోని కడుకుంట్ల గ్రామంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి మద్దిలేటి విడుదల చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సహదేవుడు, విజయ్‌కుమార్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన చింటు (21) అనే యువకుడు హైదరాబాద్‌కు డ్రైవింగ్ కోసం వెళ్లి శనివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. పెద్ద అంజి, గోవిందమ్మ దంపతుల రెండో కుమారుడు చింటు మూడు నెలల నుంచి హైదరాబాద్‌లో అక్క, బావలతో ఉంటున్నారు. అక్కడ ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. వారం రోజుల కిందట అమరచింతకు దసరా పండగకు వచ్చి డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసి వెళ్లారు. శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని బావ సమాచారం ఇచ్చారని పట్టణవాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదానికి గురైన మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు నర్సయ్య (86) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్సై మంజునాథరెడ్డి తెలిపారు. గత నెల 28న కొత్తకోటకు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం సమీపంలో రహదారి దాటుతుండగా బస్సు ఢీకొట్టిందన్నారు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని చెప్పారు. నర్సయ్య కుమారుడు మైబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన నాగయ్య (48) చికిత్స పొందుతూ మృతిచెందారని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 18న గ్రామంలో ఓ రైతు పొలంలో పురుగు మందు పిచికారి పనికి కూలీకి వెళ్లారన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటికి వచ్చి అకస్మాత్తుగా కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం వనపర్తి ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారన్నారు. చికిత్స పొందుతూ మృతిచెందారని తెలిపారు. భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాన్‌గల్, న్యూస్‌టుడే : అనుమతి లేకుండా ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను గస్తీ తిరుగుతున్న పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చిక్కేపల్లి గ్రామానికి చెందిన ఛత్రపతి ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకతో శాగాపూర్ గ్రామానికి వస్తున్న క్రమంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి, డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో దాడి ఘటన నిందితుడు?

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఈ నెల 8వ తేదీన మానాజీపేటకు చెందిన మాజీ సర్పంచి దాడి జరిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనలోని నిందితులు పరారీలో ఉన్నారు. వీరిలో ఒకతన్ని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై ఎస్సై సురేశ్‌గౌడ్‌ను వివరణ కోరగా నిందితులు పరారీలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే దాడి ఘటనలో ఓ విద్యార్థిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.